# సిద్ధంపు నగర్ కాలనీ

## ఆంధ్రాస్ ఆర్ కమింగ్

(గత సంచిక తరువాయి)

"ఒకో సీటు ఎంతా?" అడిగాడు రంగారెడ్డి.

"ఇంజనీరింగ్ కంప్యూటర్ ఎలక్ట్రానిక్స్ అయితే ఇరవై వేలు డొనేషన్ సార్! మిగతా బ్రాంచెస్‌కి పది వేలు. మెడికల్ సీటుకు లక్ష!"

మేము ఆశ్చర్యానందాలతో ఉక్కిరి బిక్కిరయాము.

"ఆ! అంత చీపా? మా ఆంధ్రప్రదేశ్‌లో లక్ష రూపాయలు పడేద్దామన్నా సీటు దొరకదు!" అన్నాడు శాయిరామ్. అతను నవ్వాడు.

"అదే మా కర్నాటక అదృష్టం సార్! ఆంధ్రప్రదేశ్ చదువుల విషయంలో ఎంత దిక్కుమాలిన రాష్ట్రమో మాకు తెలుసు. అక్కడ ప్రభుత్వాలు ఫ్రీగా ప్రజలకు సినిమాలు చూపిస్తాయనీ, ముఖ్యమంత్రే సినిమాలు తీసి బిజినెస్ చేస్తారనీ, దేశంలో మిగతా అన్ని భాషల కంటే తెలుగు సినిమాలే ఎక్కువనీ అన్నీ మా ఫ్రెండ్ ఉత్తరం రాశాడు సార్! నిజం చెప్తున్నాను. అలాంటి పనికి మాలిన రాష్ట్రాలు మా చుట్టుపక్కలుండబట్టే మా ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలకు డిమాండ్ వుంటుందికద్సార్! ఇంతకూ మీకెన్ని సీట్లు కావాలో చెప్తే బుక్ చేద్దాం సార్!"

"ఒక్క నిమిషం!" అని అతనితో చెప్పి మేమంతా అతనికి దూరంగా జరిగి మాలో మేము గుసగుసలాడుకో సాగాము.

"ఏయ్! మనం చౌకగా వస్తోంది కదా అని తొందరపడి సీట్లు కొనేయకూడదు. మనకేం ఆసక్తి లేనట్టు కొంచెం బేరాలాడదాం! వాడు ధర తగ్గిస్తే తగ్గించవచ్చు!" అన్నాడు రంగారెడ్డి.

మళ్ళీ అందరం అతని దగ్గరికి నడిచాము.

"ఇదిగో చూడబ్బీ, ఒకో ఇంజనీరింగ్ సీట్‌కి మూడు వేలిస్తాం, ఇస్తే ఇవ్వు! లేకపోతే లేదు" అన్నాడు అప్పలాచారి.

ఆ వ్యక్తి మాకేసి విచిత్రంగా చూశాడు.

"నీయమ్మ — నాకిప్పుడే డౌటొచ్చింది. ఆంధ్రాస్ అయితే ఇలా అడుక్కుతినే వాళ్ళలాగా వుండరే అని! పైగా కార్లు లేవు! మీరు తమిళియన్స్‌గానీ కేరళైట్స్ గానీ అయుంటారు కదూ?" అడిగాడతను.

"కాదు! మేము ఆంధ్రాసే-" కోపంగా అన్నాడు గోపాత్రావ్.

"ఆంధ్రాసయితే ఇంత చీప్ చీప్ బేరాలాడగరే! ఒక వేళ మీ ఫోర్ ఫాదర్స్ మద్రాస్‌కి గాని కేరళాకి గానీ చెంది వుంటారు—"

అతను కార్లో వెళ్ళిపోయాడు.

తిన్నగా మేమందరం ఓ ఇంజనీరింగ్ కాలేజీకి చేరుకున్నాం.

ప్రిన్సిపాల్ రూమ్ చేరుకోగానే ప్యూన్ వినయంగా వంగి నమస్కారం చేసి తలుపు తెరచి పట్టుకున్నాడు.

మాకు మతిపోయినంత పనయింది.

"అదేమిటి? ప్రిన్సిపాల్ గారి పర్మిషన్ తీసుకున్నావా?"

"మీరు ఆంధ్రాసే కద్సార్! పర్మిషన్ అఖ్కర్లేదండీ! మీ కోసమే మా కాలేజీ కమిటీ మెంబర్లందరూ రెండ్రోజుల్నించి వెయిట్ చేస్తున్నారు సార్!"

మేము లోపలికి నడిచాము.

లోపల అందరూ ప్రేమగా చిరునవ్వు నవ్వారు.

"రండి! వెల్‌కమ్ టు కర్నాటకా — ఇండియాలో మిగతా రాష్ట్రాలన్నిటికీ విద్యాదానం చేస్తున్న మా రాష్ట్రానికి స్వాగతం" అన్నాడు ప్రిన్సిపాల్.

అందరం నమస్కరించి కూర్చున్నాం.

"ఎన్ని సీట్లు కావాలి?" అడిగాడు ప్రిన్సిపాల్.

"పన్నెండు—"

"ఒండర్ ఫుల్! మీ బ్రీఫ్‌కేస్‌లేవీ!"

మేము అదిరిపడ్డాము.

"బ్రీఫ్‌కేస్ లేమిటి?"

"అదే! ఆంధ్రాస్ బ్రీఫ్‌కేసులో నోట్ల కట్టలు తెస్తారు కదా!"

మేము నవ్వేశాము.

"మా దగ్గర అలాంటివేమీ లేవండీ! మేము మామూలు మిడిల్ క్లాస్ వాళ్ళం—"

అతను ఆశ్చర్యపోయాడు.

"ఆంధ్రాస్‌లో మిడిల్ క్లాస్ వాళ్ళు కూడా వుంటారా?"

"ఎందుకుండరండీ? మేము ప్రత్యక్షంగా కనబడుతూనే వున్నాం కదా!"

ప్రిన్సిపాల్ వెంటనే ఎక్కడికో ఫోన్ చేశాడు.

"త్వరగా రండి! ఇక్కడ కొంతమంది ఆంధ్రాస్ వచ్చారు! వాళ్ళు బీదాళ్ళట! తమాషాగా లేదూ! రండి వాళ్ళను చూద్దురుగాని—" అని కన్నడలో చెప్పి ఫోన్ పెట్టేశాడు.

మాకు ఒళ్ళు మండిపోతోంది — మమ్మల్ని 'జూ'లో జంతువుల్లా అతను ట్రీట్ చేయడం.

"ఇంతకూ డొనేషన్ ఎంతో చెప్తే మేము ఆలోచించుకుంటాము" అన్నాడు రంగారెడ్డి కోపంగా.

"డొనేషన్ మామూలే! ముప్ఫయి వేలు — అది గాక నాలుగేళ్ళ ఫీజు కూడా ముందే కట్టాలి—"

"ఫీజెంత?"

"సంవత్సరానికి పన్నెండున్నరవేలు చొప్పున యాభయి వేలు—"

మాకు గుండాగినంత పనయింది.

"అదేమిటి? ఫీజు సంవత్సరానికి ఎనిమిది వేలే అన్నారు కదా?"

"అది జనతా ప్రభుత్వం రోజుల్లో — ఇప్పుడు గవర్నర్ రూల్ కదా! ఆ మాత్రం పెరగదేమిటి?"

మేము మాట్లాడకుండా లేచి బయటికొచ్చాము.

రోడ్ మీద కొచ్చేసరికి నలుగురు వ్యక్తులు మా చుట్టూ మూగారు.

"ఇంజనీరింగ్, మెడికల్ సీట్లు సార్! అయిదు వేలు డొనేషన్ — బెంగుళూరు, బీజాపూర్, తుంకూర్, కోలార్, హుబ్లి, ధార్వాడ్, ఖార్కి, బీదర్—" అన్నాడొకతను.

"అయిదు వేలేనా?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"అవున్సార్! కేవలం అయిదు వేలు! ఎన్నిమ్మంటారు?"

"పన్నెండు కావాలి? మొత్తం మీద ఏమయినా తగ్గిస్తావా?" అడిగాడు రంగారెడ్డి.

"నాలుగు వేలు సీటు చొప్పున ఇవ్వండి సార్ — తలో అయిదొందలూ అడ్వాన్స్ కట్టండి చాలు —"

"మరి ఫీజు కూడా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం కడతాము—"

యర్రంశెట్టి శాయి

"ఏం ఫర్లేదు సార్! అంతా మీ ఇష్టం—"

మేము డబ్బు లెక్క పెడుతుంటే అతని పక్కనున్న రెండోవాడు ఘొల్లున నవ్వాడు.

"గోవిందా! గోవిందా! వాడు చెప్పిన కాలేజీల్లో చేరారో— మీ పిల్లడి భవిష్యత్తు గోవిందా గోవిందా!"

మేము కంగారుగా డబ్బు లెక్క పెట్టడం ఆపి వాడి వేపు చూశాము.

"ఏమిటి నువ్వనేది?"

"ఆ కాలేజీలో చేరిన పిల్లలందరూ బెంగుళూరు కెంపగౌడ రోడ్‌లో ఫుట్‌పాత్ పక్కన పడి వుంటారు. చూస్తారా?"

"అదేమిటి? ఎందుకలా పడి వుండడం?"

"ఎందుకేమిటి సార్! డ్రగ్స్! అంతా డ్రగ్ ఎడిక్ట్స్ అయిపోతారు — ఆ తరువాత ఇంకేముంది గోవిందా, గోవిందా—"

మాకు గుండె ఆగిపోయినంత పనయింది.

"అంచేత నా దగ్గర వున్న లిస్ట్‌లోని కాలేజీల్లోనే చేరండి! ఫీజు యాభై వేలు కడితే చాలు! నో డొనేషన్"

మాకు ఎక్కడలేని ఆనందం కలిగింది.

"డొనేషన్స్ అస్సలు లేవా?"

"అస్సల్లేద్సార్—"

"మరి అక్కడ డ్రగ్స్ లేవా?"

"డ్రగ్స్ అస్సల్లేవు! మోస్ట్ డిసిప్లిన్డ్ ఇన్‌స్టిట్యూషన్స్! సీటుకి రెండొందలు చొప్పున అడ్వాన్స్ కొట్టండి చాలు—"

మేము తలో రెండొందలూ పోగు చేస్తుండగా మూడోవాడు ఘొల్లున నవ్వాడు.

"డ్రగ్స్ లేవనగానే బోల్తా పడిపోయారు సార్! కానీ ఆ కాలేజీల్లో స్టాఫ్ లేరు సార్! ప్రొఫెసర్లంతా డిప్లొమా హోల్డర్స్ — లాబొరేటరీలు లేవు. వర్క్ షాప్ లేదు. ఇంక మీ పిల్లలు చూస్కోండి! తాపీ మేస్త్రీలవుతార్సార్! ఇంజనీర్లు కాదు-"

మాకు ఏడుపొచ్చేసింది. రెండో వాడి వేపు కోపంగా చూశాము.

"అతను చెప్పేది నిజమేనా?"

"అంతా అబద్ధం! మొన్నే ఒక కంప్యూటర్‌కి కూడా ఆర్డరిచ్చారు. మీ కుర్రాళ్ళు ఫైనలియర్ కొచ్చే లోపల వచ్చేస్తుందది"

"మరి ఈలోగా ఏం చెప్తారు?"

"ఈలోగా బోర్డ్ మీద బొమ్మలు గీసి చెప్తారు. కంప్యూటర్ రియల్ ఫోటోలు చూపిస్తారు — అంత కంటే ఇంకేం కావాలి?"

మాకు పిచ్చెక్కినట్టయింది.

ఈలోగా ఇంకోడెవరో దూరం నుంచి అరిచాడు.

"ఒరే నందా రా! త్వరగా రా! అనలీ ఆంధ్రాస్ వస్తున్నా రిక్కడ—"

## యర్రంశెట్టి శాయితో ముఖాముఖి

ప్రశ్నలు పంపవలసిన చిరునామా:

యర్రంశెట్టి శాయి, ఫ్లాట్ నెం: 68

ఎల్.బి.నగర్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక,

హైదరాబాద్-500 963

ఆ మాట వింటూనే వాళ్ళంతా పరుగుతో వెళ్ళిపోయారు.

మేము బ్రతుకు జీవుడా అని అక్కడి నుంచి బయల్దేరాము.

వారం రోజుల పాటు పాతిక కాలేజీలకు వెళ్ళి వివరాలన్నీ వాకబు చేసుకుంటూ డొనేషన్లు బేరాలాడుకుంటూ చివరకు ఓ ఊర్నేని కాలేజీలో సీట్లు కొనేశాం.

"హమ్మయ్యా — ఎలాగయితేనేం మన మధ్య తరగతి పిల్లలు కూడా ఇంజనీరింగ్ చదివే అవకాశం మనకిచ్చిన కర్నాటక ప్రజలకు జై" అన్నాడు రంగారెడ్డి.

అప్పుడే ప్రిన్సిపాల్ గదిలోకి ఓ వ్యక్తి పరుగెత్తుకెళ్ళాడు.

"మా డబ్బు మాకిచ్చేయండి సార్— మావాడిక్కడ చదవనంటున్నాడు—" అంటూ బ్రతిమాలడం విని పించిది మాకు.

"ఒకసారి కట్టిన డబ్బు ఏ పరిస్థితుల్లోనూ తిరిగి ఇవ్వబడదు అని బోర్డు పెట్టాం కద్సార్."

సాపుగంట సేపు బ్రతిమాలి అతను కళ్ళ వెంబడి నీరు పెట్టుకుంటూ బయటికొచ్చేసాడు.

మేమంతా అతని చుట్టూ మూగాం.

"ఏమిటి? ఎందుకు డబ్బు వాపస్ అడుగుతున్నారు?"

"ఈ కాలేజీకి యూనివర్సిటీ రికగ్నిషన్ రాలేదంట సార్! కిందటి సంవత్సరం స్టూడెంట్స్‌ని పరీక్ష రాయనీ లేదట"

మా గుండెలవిసి పోయాయ్.

"రికగ్నిషన్ లేకుండా కాలేజీ పెడితే గవర్నమెంట్ ఎలా ఊరుకుంది?"

"గవర్నమెంట్‌కేం సంబంధం? వాళ్ళు కాలేజీ పెట్టడానికి పర్మిషన్ ఇచ్చారు— అంతే! యూని వర్సిటీ ఎఫిలియేషన్స్ తెచ్చుకోవడం కాలేజీ వాళ్ళ తల నొప్పి ఇక"

"మరి యూనివర్సిటీ వాళ్ళు ఎందుకివ్వడం లేదు ఎఫిలియేషన్?"

"ఆ యూనివర్సిటీ ఛాన్సెలర్ లింగాయత్ కమ్యూనిటీకి చెందినవాళ్ళు — కాలేజీ ఓనర్ గౌడా కమ్యూనిటీకి చెందిన వాళ్ళు. అంచేత తన కంఠంలో ప్రాణం వుండగా ఇవ్వనని ఛాన్సెలర్ పట్టు పట్టాడట."

మాక్కూడా ఆ మాట వినేసరికి ఏడుపొచ్చింది.

అందరం మళ్ళీ ప్రిన్సిపాల్ దగ్గరకు పరుగెత్తాం. అప్పటికే మరో పాతిక మంది మాలాంటి పేరెంట్స్ మూగిపోయి వున్నారతని చుట్టూ.

"నేను చెప్తున్నాను కదా. మీకేం ఫర్లేదు. మన కాలేజీకి ఇంకో వారం రోజుల్లో ఎఫిలియేషన్ వచ్చేస్తుంది. మన కేసు సుప్రీంకోర్టుకి కూడా వెళ్ళింది- ఒకవేళ రాకపోతే అప్పుడు మీ డబ్బు మీకు వాపస్! సరేనా?"

చేసేది లేక తలూపి బయటపడ్డాం.

బస్‌లో తిరిగి హైదరాబాద్ బయల్దేరాం. బస్‌లో అందరూ మాలాంటి వాళ్ళే! ఇంజనీరింగ్, లా, ఫార్మసీ, పాలిటెక్నిక్ చదవటానికి వచ్చినవాళ్ళు. కొద్ది సేపటి తర్వాత కర్నాటక రాష్ట్రంలో నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లోకి ప్రవేశించింది మా బస్.

రోడ్డుకి అడ్డంగా కట్టిన ఆర్చిమీద "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీకు స్వాగతం చెప్తోంది" అని రాసి వుంది.

దాని మీద తాటిచెట్టంత ఎత్తున ముఖ్యమంత్రి బొమ్మ చిరునవ్వుతో చేతులు జోడిస్తోంది.

"సీయవ్వ ఆంధ్రప్రదేశ్! థూ! చదువుల కోసం పక్క రాష్ట్రాల కెళ్ళి నానా అవస్థలూ పడాల్సి వచ్చిన సనికిమాలిన రాష్ట్రం!" అన్నాడు రంగారెడ్డి.

"పనికి మాలిన రాష్ట్రమేమిటి? అడుక్కుతినే రాష్ట్రం! మనం దీపం వెలిగించుకోవాలన్నా కూడా పొరుగు రాష్ట్రాన్ని కరెంట్ అడుక్కోవాలి" అన్నాడు శాయిరామ్.

"ఆఖరికి కిలో రెండ్రూపాయలు బియ్యం కావాలన్నా కేంద్రాన్ని అడుక్కోవాలి!" అన్నాడు గోపాల్రావ్.

ఆ తరువాత మన రాష్ట్రం ఇంకా ఏమేం విషయాల్లో ఇతర రాష్ట్రాల్ని అడుక్కుతింటోందో మాలో అందరూ తలోటీ చెప్తుంటే మాకే సిగ్గేసింది. ఆ పక్కనే వినబడు తోంది. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ—"

**వచ్చేవారం**

**బంద్-1999**

అమెరికాకు చెందిన ఏడడుగుల పొడవున్న సంగ్రబోక్ ప్రపంచంలో కెల్లా పొడవైన ట్రాఫిక్ కానిస్టేబుల్. సాధారణంగా ఇంత పొడవైన వ్యక్తిని పోలీసుగా తీసుకోరు. కాని ఇతని విషయంలో వున్నతాధికారులు ప్రత్యేక అనుమతి ఇచ్చారు. ఇతని పొడవుకు తగ్గట్టుగా ఓ ప్రత్యేక కారును తయారు చేసి ఇతనికి ఇచ్చారు. అక్కడ ట్రాఫిక్ పోలీసులు కారు కూడా నడపాల్సి వుంటుంది. ఎలాగోలా కష్టపడి అతను కారు నడుపుతున్నాడు.

-వి. ఉమ